RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

### పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నిర్మల్, ఏప్రిల్ 25(ఎ.ఎం.ఎస్): పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని జన్నారం మండల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ ఉమా శ్రీ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం జన్నారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో వైద్యులు, వైద్య సిబ్బంది కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమల బెడద పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దోమలు కుడితే మలేరియా వస్తుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

### ప్రజల ముందు బీఆర్ఎస్ నేతల నిజస్వరూపాన్ని బయట పెడతాం

వైరా, ఏప్రిల్ 25(ఎ.ఎం.ఎస్): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఆ పార్టీ నేతలు చేసిన అవినీతి అక్రమాలను వారి నిజస్వరూపాన్ని ప్రజల ముందు బయటపెడతామని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సీనియర్ అడ్వకేట్ బోడేపూడి విఠల్ రావు వెల్లడించారు. గురువారం మండలంలోని గోవింద్రాల బంజర గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డం పెట్టుకొని మండల బీఆర్ఎస్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమ సొంత ఆస్తులు పెంచుకున్నారని ఆరోపించారు.

సంపుటి : 11 || సంచిక : 181 || ఆదిలాబాద్ || శుక్రవారం, ఏప్రిల్ 26, 2024 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

# ఏపీ, తెలంగాణలో ముగిసిన నామినేషన్లు

- ఏపీలో అసెంబ్లీకి 4,384నామినేషన్లు
- లోక్‌సభ స్థానాలకు 763నామినేషన్లు
- తెలంగాణలో 17ఎంపీ స్థానాల్లో 547నామినేషన్లు
- అత్యధికంగా మల్కాజిగిరిలో 101నామినేషన్లు
- కంటోన్మెంట్‌లో 38నామినేషన్లు
- నేడు పరిశీలన..29న ఉపసంహరణ




హైదరాబాద్ : ఏపీ అసెంబ్లీ 175స్థానాలకు, 25 లోక్‌సభ స్థానాలకు, తెలంగాణలో 17లోక్‌సభ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల నిర్వాహణలో నామినేషన్ దాఖలు ఘట్టం గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగిసిపోయింది. ఈ నెల 18వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాగా 18వ తేదీ నుంచి 25 వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించారు. నేడు శుక్రవారం నామినేషన్ల పరిశీలన, తిరస్కరణ..29న ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. మే 13న పోలింగ్ నిర్వహించి జూన్ 4 ఓట్లు లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఏపీలో 175అసెంబ్లీ స్థానాలకు 4,384నామినేషన్లు దాఖలయ్యాయి. 25లోక్‌సభ స్థానాలకు 763నామినేషన్లు దాఖలయ్యాయి. ఇకపోతే తెలంగాణలోని 17లోక్‌సభ స్థానాలకుగాను 547నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. అత్యధికంగా మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానానికి 101నామినేషన్లు దాఖలయ్యాయి. నల్లగొండలో 85 నామినేషన్లు, భువనగిరిలో 81, నిజమాబాద్‌లో 77, పెద్దపల్లిలో 74, కరీంనగర్‌లో 69, వరంగల్‌లో 62, సికింద్రాబాద్ 60, చేవెళ్లలో 59, ఖమ్మంలో 57, మెదక్‌లో 55, హైదరాబాద్‌లో 48, జహీరాబాద్‌లో 41, మహబూబ్ నగర్‌లో 42, ఆదిలాబాద్‌లో 39, మహబూబబాద్‌లో 32, నాగర్ కర్నూల్‌లో 23 నామినేషన్లు దాఖలైనట్లుగా సమాచారం.

ఉప ఎన్నిక జరుగనున్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి 38నామినేషన్లు దాఖలయ్యాయి.



# 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 89 స్థానాలకు నేడే ఎన్నికలు

హైదరాబాద్ ఏప్రిల్ 25 : లోక్ సభ రెండో దశ ఎన్నికలు రేపు(శుక్రవారం) జరుగనున్నాయి. 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 89 స్థానాలకు ఈ ఎన్నికలు జరుగనున్నాయి. కాగా ఈ 89 సీట్లలో 9 ఎస్సీలకు, 7 ఎస్టీలకు రిజర్వు చేశారు. ఈ దఫా ఎన్నికల్లో 1210 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 543 లోక్ సభ స్థానంలో మూడో వంతు స్థానాలకు ఈ రోజున ఎన్నికలు జరుగనున్నాయి. ప్రధానంగా కేరళ, రాజస్థాన్, మణిపూర్, త్రిపుర, కర్నాటకలోని 28 సీట్లలో 14 సీట్లకు ఈ రోజున ఎన్నికలు జరుగనున్నాయి. ప్రముఖ పోటీదారులలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, కాంగ్రెస్ (తిరువనంతపురం), భారతీయ జనతా పార్టీకి చెందిన తేజస్వి సూర్య (బెంగళూరు దక్షిణ లోక్‌సభ), హేమమాలిని (మధుర), అరుణ్ గోవిల్ (మీరట్), కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ (వయనాడ్) ఉన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ సోదరుడు డికె సురేశ్(బెంగళూరు రూరల్), కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి (మాండ్య) మరియు స్వతంత్ర అభ్యర్థి పప్పు యాదవ్ (పూర్ణియా), సిపిఐకి చెందిన అన్నీ రాజా (వయనాడ్).

# కార్పోరేట్లకు మోకరిల్లిన మోదీ సర్కార్: సీఎం రేవంత్‌రెడ్డి

### గత హామీలను విస్మరించిందంటూ ఫైర్
### నయవంచన పేరుతో బీజేపీపై చార్జిషిట్ విడుదల
### పదేండ్ల మోసం వందేండ్ల విధ్వంసాన్ని ఓడించాలని పిలుపు
### ఈ ఎన్నికలు రిజర్వేషన్లు వర్సెస్ రిజర్వేషన్లు రద్దుపై రెఫరెండమ్

హైదరాబాద్,ఏప్రిల్ 25 : ప్రధాని మోదీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్లకు మోకరిల్లి దేశ సంపదను వారికే దోచిపెడుతు పేద, మధ్యతరగతి ప్రజలపై ధరలు..పన్నుల భారం మోపి దేశాన్ని అప్పుల పాలు చేసిందని పీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. గురువారం గాంధీభవన్‌లో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై నయవంచన..వదేండ్ల మోసం..వందేండ్ల విధ్వంసం పేరుతో కాంగ్రెస్ రూపొందించిన చార్జిషిట్‌ను రేవంత్‌రెడ్డి విడులద చేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీజేపీ డబుల్ ఇంజిన్ అంటే అంబానీ, అదానీయే అన్నారు. కాంగ్రెస్ పాలనలో దేశ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ పరిశ్రమలను మోదీ ప్రైవేటు చేసి జాతీ సంపదను కార్పోరేట్లకు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారని.. హామీ ప్రకారం పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి కదా అని ప్రశ్నించారు. కానీ బీజేపీ హయాంలో 7 లక్షల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారన్నారు. ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మోడీ సర్కార్ మోసం చేసిందన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని.. రూ.15 పైసలు కూడా వేయలేదని ఎద్దేవా వేశారు. అగ్గిపెట్టె, అగరుబత్తి మీద కూడా మోడీ ప్రభుత్వం జీఎస్టీ విధించిందన్నారు. 67 సంవత్సరాల్లో 14 మంది ప్రధానులు 55 లక్షల కోట్లు అప్పు చేస్తే.. ఈ పదేళ్లలో మోడీ చేసి 113 లక్షల కోట్లు చేశారన్నారు. నయా భారతాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. 60 ఏళ్లు కాంగ్రెస్ కూడబెట్టిన 60లక్షల కోట్ల ఆస్తులను మోదీ పదేళ్లలో 6లక్షల కోట్లకు కార్పొరేట్ లకు కట్టబెట్టారని విమర్శించారు. ఎల్ఐసీ సహా ప్రతి ప్రభుత్వ సంస్థను కార్పొరేట్ కంపెనీలకు అమ్మేస్తున్నారన్నారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, జాతీయరహదారులు కార్పోరేట్లకు కట్టబెట్టారన్నారు. డబుల్ ఇంజన్ పేరిట బీజేపీ దేశాన్ని లూటీ చేసిందన్నారు.

ఈ ఎన్నికలు రిజర్వేషన్లు వర్సెస్ రిజర్వేషన్లు రద్దు..

ఎస్సీ, ఎస్టీ,ఓబీసీ రిజర్వేషన్లపై బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. వందేళ్లలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు రద్దు చేయాలనేదే ఆరెస్ఎస్ విధానం అన్నారు. ఆరెస్ఎస్ ఆవిర్భవించి 2025కు వంద సంవత్సరాలు అవుతుందన్నారు. అందుకే రిజర్వేషన్లు రద్దు చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని సీఎం రేవంత్ ఫైర్ అయ్యారు. బీజేపీ విధానం దేశంలో ఉన్న రిజర్వేషన్లు రద్దు చేయడమే అని రేవంత్ అన్నారు. ఆరెస్ఎస్ విధానాలనే బీజేపీ అమలు చేస్తోందన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఓబీసీ కుల గణన చేపడితే.. రిజర్వేషన్లు 70 నుంచి 75 శాతానికి పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకే ఈ రిజర్వేషన్లు రద్దు చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. వర్గీకరణ కోసం కొట్లాడిన వారు కూడా ఇప్పుడు బీజేపీ కి ఎందుకు మద్దతు ఇస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు. రిజర్వేషన్లు ఉండాలా రద్దుకావాలా అనే దానికి రెఫరెండమ్ ఈ ఎన్నికలు అన్నారు.

బీజేపీకి వేసే ప్రతి ఓటు రిజర్వేషన్ల రద్దుకు వేసినట్లే అని రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీకి ఓటు వేస్తే మీ హక్కును మీరు కాలరాసుకున్నట్లే అన్నారు. రిజర్వేషన్ల రద్దు కోసమే బీజేపీ 400 సీట్లు కావాలని అంటోందన్నారు. 2/3 మెజార్టీతో రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర పన్నుతోందని రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు టి.జగ్గారెడ్డి, బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




# ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్. జగన్ పులివెందుల నుంచి నామినేషన్

### రాజశేఖర్ రెడ్డి దుర్మరణానికి కుట్ర పన్నిన వారితోనే తన సోదరీమణులు చేతులు కలిపారు



విజయవాడ ఏప్రిల్ 25 : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సిపి అధ్యక్షుడు వైఎస్. జగన్ గురువారం పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తన నామినేషన్ ఫైల్ చేశారు. ఈ సందర్భంగా జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ పులివెందుల తన హార్ట్ బీట్ అన్నారు. పులివెందుల ఓటర్ల మద్దతుతోనే తన పయనం కొనసాగుతోందన్నారు. సిఎస్ఐ గ్రౌండ్ లో జగన్ ప్రసంగిస్తున్నప్పుడు 'జై జగన్' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. జగన్ తన ప్రసంగంలో కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్. షర్మిల, వైఎస్. సునీత లను విమర్శించారు. తన పినాన్న వివేకానంద రెడ్డి మరణానికి కారకులెవరో ప్రజలకు బాగా తెలుసునని జగన్ తెలిపారు. తన తండ్రి వైఎస్. రాజశేఖర్ రెడ్డి దుర్మరణానికి కుట్ర పన్నిన వారితోనే తన సోదరీమణులు చేతులు కలపడంపై ఆయన సంతాపం వ్యక్తం చేశారు. అలాగే అవినాశ్ రెడ్డికి కళంకం అంటగట్టడానికి ప్రయత్నించడాన్ని కూడా ఆయన దుయ్యబట్టారు.

# ఆగష్టు 15 లోపు రైతు రుణమాఫీ నిజం అయితే...

### రాజీనామా పత్రంతో అమరవీల స్థూపం వద్దకు రావాలి
### రేవంత్ రెడ్డికి ఎంఎల్ఎ హరీష్ రావు సవాల్



మెదక్: ఆగష్టు 15 లోపు రైతు రుణమాఫీ, ఆరు హామీలు అమలు చేయడం నిజం అయితే అమరవీరుల స్థూపం వద్దకు సిఎం రేవంత్ రెడ్డి రావాలని మాజీ మంత్రి, ఎంఎల్ఎ హరీష్ రావు సవాల్ విసిరారు. అమరవీల స్థూపం వద్దకు రాజీనామా పత్రంతో తాను వస్తానని, రేవంత్ రెడ్డికి దమ్ముంటే రావాలన్నారు. మెదక్ రోడ్ షో లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సంచలన కామెంట్స్ చేశారు. 'రాజీనామా లేఖలను ఇద్దరం కలిసి మేధావులు చేతిలో పెడదాం. సిఎం రేవంత్ రెడ్డి చెప్పినవి అమలు చేస్తే తన రాజీనామా లేఖను ఆ మేధావులు స్పీకర్ కు ఇస్తారు. చేయకుంటే రేవంత్ రాజీనామా లేఖను గవర్నర్ కు ఇస్తారు. రాజీనామాకు సిద్ధమేనా అని అడుగుతున్నానని సవాల్ విసిరారు. గతంలో కొడంగల్ లో రాజకీయ సన్యాసం తీసుకుంటా అని రేవంత్ తోక ముడిచాడని, ఇప్పుడు అదే రిపీట్ అవుతుందని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులు, బి ఆర్ ఎస్ పార్టీ అంటే ఎండ కూడా బయపడుతుందని, 25 సంవత్సరాలలో మెదక్ లో గులాబీ జెండా ఎగురుతుందని వేరే జెండా ఎగురడం లేదు, మెదక్ జిల్లా గులాబీ అడ్డా, మళ్ళీ బి ఆర్ ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్లలో కెసిఆర్ ఏం చేశారని రేవంత్ రెడ్డి అడుగుతున్నారు. కెసిఆర్ తోనే కొత్త జిల్లాలు ఏర్పాటు చేసుకున్నామని, కెసిఆర్ నిర్మించిన కలెక్టర్ ఆఫీస్ కు నామినేషన్ కార్యక్రమంలో రేవంత్ పాల్గొన్నారన్నారు. పేగులు మెడలో రాక్షసులు వేసుకుంటారని సిఎం స్థాయి తగ్గించుకొని మాట్లాడాలి, మెదక్ అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు రేవంత్ కు లేదని ఘాటుగా విమర్శించారు. జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు మెడికల్ కాలేజీలు కెసిఆర్ తెచ్చారు,

అందమైన నాలుగు లైన్ రహదార్లు వేశామని చెప్పుకొచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ అమలు అని బాండ్ పేపర్ మీద రాశారు, బాండ్ పేపర్ పరువు తీశారు, దేవుళ్ళను రాజకీయాలకు వాడుతున్నారు, రేవంత్ ఎవరి మీద ఓట్లు పెట్టినా జనాలు నమ్మడం లేదని చురకలంటించారు. ఆరు హామీలు అమలు కాలేదు కానీ గొప్పలు చెప్పుకుంటున్నారు. ఈ ముఖ్యమంత్రి కి తన ఎత్తు గురించి ధ్యాస ఉంది గాని రైతుల సమస్య పట్ల ధ్యాసే లేదు అని మండిపడ్డారు. 200 పైగా రైతులు, 30 మంది ఆటో కార్మికులు చనిపోయినా కూడా వారి కుటుంబాలను రేవంత్ పరామర్శించడం లేదని ధ్వజమెత్తారు. బిజెపి రఘునందన్ మాటలు నమ్మడమంటే నీళ్ల లేని బావిలో దూకడమే నయం, దుబ్బాకల అలాగే మాట్లాడితే అక్కడ ప్రజల బుద్ధి చెప్పారు. బిజెపి ఏ వర్గాలకు మేలు చేయలేదు, బిఆర్ఎస్ ఈ ఎన్నికలలో గెలిస్తే భయంతో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. బిఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ వాళ్ళ మెడలు ఉంచడం సాధ్యమవుతుందని, కాంగ్రెస్ వాళ్లను భూమి మీద దించాలంటే వెంకట్రామ రెడ్డిని గెలిపించాలని కోరారు. బిఆర్ఎస్ కు మంచి అభ్యర్థి దొరికాడు, వెంకటరామిరెడ్డిని మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు.


ఒకాయన ఆరో తరగతి, మరొకరు బ్లాక్ మెయిలర్, బి ఆర్ ఎస్ నుండి కలెక్టర్ గా పని చేసిన వ్యక్తి ఉన్నాడు, ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తా అంటున్నాడు, ప్రజలు కార్యకర్తల దగ్గరికి వెళ్లి కాంగ్రెస్, బిజెపి మోసాల గురించి చెప్పాలని' హరీష్ రావు వివరించారు.

# మే 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది ఎన్నికల కమిషన్. మే 2వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయనున్నది. నామినేషన్లు వేసేందుకు మే, 9వ తేదివరకు గడువు పెట్టింది. మే, 10న స్క్రూటినీ, నామినేషన్ల ఉపసంహరణకు 13 వ తేదీ వరకు సమయం ఇచ్చింది. ఇక పోలింగ్ మే, 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరగనున్నది. అయితే ఈ ఎన్నిక కౌంటింగ్ జూన్, 5వ తేదీన నిర్వహించి, ఫలితాలను జూన్, 8వ తేదీన వెల్లడిస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.




# శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసి గుడ్ న్యూస్



శ్రీశైలం వెళ్లే భక్తులకు ఆర్టీసి గుడ్ న్యూస్ చెప్పింది. వేసవిని దృష్టిలో పెట్టుకొని భక్తుల సౌకర్యార్థం శ్రీశైల పుణ్యక్షేత్రానికి రాజధాని ఎసి బస్సులను ఆర్టీసి నడుపుతోంది. హైదరాబాద్ నుంచి ప్రతి గంటకో బస్సును భక్తులకు అందుబాటులో ఉంచింది. ఈ బస్సుల్లో జేబిఎస్ నుంచి రూ.524, బిహెచ్ఈఎల్ నుంచి రూ.564 టికెట్ ధరను నిర్ణయించింది. ఆధునిక హంగులతో ఘాట్ రోడ్డుకు తగ్గట్టుగా ఈ రాజధాని ఎసి బస్సులను ప్రత్యేకంగా సంస్థ తయారు చేయించింది. వేసవిలో చల్లదనం అందించే ఈ బస్సులను వినియోగించుకొని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకోవాలని సంస్థ సూచిస్తోంది. ఈ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం http://tsrtconline.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆర్టీసి పేర్కొంది.

